క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

కోయిల్‌కొండ: మండలంలోని పలు అభివృద్ధి పనులను శుక్రవారం నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీపీ శశికళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అనంతపూర్‌లో కమ్యూనిటీ హాల్, ఖాజీపూర్‌లో సీసీరోడ్డు పనుల ప్రారంభం, లింగుపల్లిలో క్రీడాప్రాంగణం, వాటర్‌ట్యాంక్, సీసీరోడ్డు పనులు ప్రారంభం, మధ్యాహ్నం వీరంపల్లిలో క్రీడాప్రాంగణం, వాటర్ ట్యాంకు, సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఆచార్యపూర్‌లోని వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారని, గార్లపహాడ్‌లో పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరవుతారని వెల్లడించారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

అడ్డాకుల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అడ్డాకులకు చెందిన ఈడిగి సువర్ణకు ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నర్ర శ్రీనివాస్‌లు కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ రంగన్నగౌడ్, తిమ్మాయిపల్లి సర్పంచ్ ఆంజనేయులు, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

రైతుబీమా..

దేవరకద్ర: మండల కేంద్రానికి చెందిన రైతు మాల నాగరాజు మృతిచెందడంతో రైతుబీమా పథకం కింద వచ్చిన రూ.5లక్షల చెక్కును గురువారం బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు చెక్కు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ వెంకటేష్, ముడా డైరక్టర్ కరణంరాజు, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, బాల్‌రాజు, శేఖర్‌రెడ్డి, సత్యంసాగర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి

జడ్చర్ల: రైతువేదికలు నిర్మించి ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు విడుదల చేయలేదని, వెంటనే నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని బాధిత రైతు సంఘాల నాయకులు గురువారం మంత్రి నిరంజన్‌రెడ్డిని వనపర్తిలో కలిసి విన్నవించారు. జడ్చర్ల మండలంలో నిర్మించిన రైతు వేదికలకు మొదటి విడతగా ఒక బిల్లును మంజూరు చేశారని, పూర్తి స్థాయిలో రైతువేదికలు నిర్మించి ప్రారంభించినా ఇప్పటి వరకు తుది బిల్లులు విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు పాలగోపాల్, రఘురాం రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లను బాధ్యులను చేయడం సరికాదు

స్టేషన్ మహబూబ్‌నగర్: పదో తరగతి పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలపై టీచర్లను బాధ్యులను చేయడం సరికాదని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరో ప్రశ్నాపత్రాన్ని దొంగతనంగా తీసుకొని దాని వైరల్ చేస్తే ఏకంగా ఉపాధ్యాయులపై శాశ్వతంగా ఉద్యోగాలు తొలగించే తీవ్రమైన చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.

భీంపల్లి శ్రీకాంత్‌కు ఉగాది పురస్కారం



స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రముఖ కవి, రచయిత, పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్‌కు సంస్కార భారతి వారి శ్రీశోభకృత్ నామ సంవత్సర రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం లభించింది. బుధవారం రాత్రి తెలంగాణ సినిమా, టీవీ రంగస్థల అభివృద్ధి సంస్థ సహకారంతో సంస్కార భారతి ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ భీంపల్లికి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, సంస్కార భారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడ్రేవు శివాజీ, ఉపాధ్యక్షుడు టీవీ రంగయ్య, నంది అవార్డు గ్రహీత నారాయణాచారి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

మిడ్జిల్: మండలంలోని వేములలో శివాంజనేయస్వామి ఆలయం నూతన కమిటీని గురువారం సర్పంచ్ జంగయ్య, ఎంపీటీసీ యశోద సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చైర్మన్ విశ్వనాథం చారి తెలిపారు. ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, శ్యామ్, రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, సహాయ కార్యదర్శులుగా పెంటయ్య, నరేష్, జంగయ్యగౌడ్, కోశాధికారిగా జగదీశ్వర్, సహాయ కార్యదర్శులుగా అశోక్, రమేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా శ్యాం సుందర్‌రావు, మైసయ్య, పాండు, సలహాదారులుగా రఘుపతిరెడ్డి, దామోదర్‌రెడ్డి, లింగం గౌడ్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందు

హన్వాడ: మండల కేంద్రానికి చెందిన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. తన స్వగృహంలో భోజనాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కలీం, కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు షబ్బీర్, నాయకులు తయ్యబ్, అలీ, జాంగీర్, సలీం పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కందూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



మహమ్మదాబాద్ మండలం గూంగ్యతండాలో..



దేవరకద్రలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



జిల్లా కేంద్రంలో నిర్వహించిన శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు



స్టేషన్ మహబూబ్‌నగర్/సాక్షి నెట్‌వర్క్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పట్టణంలో మహా శోభయాత్ర నిర్వహించారు. స్థానిక రామమందిరం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. శోభాయాత్రకు హారతి ఇచ్చి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. మేళతాళాలతో స్వామివారి ఊరేగింపుతో శోభాయాత్ర రాంమందిర్ చౌరస్తా, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, న్యూటౌన్ చౌరస్తా మీదుగా టీటీడీ కళ్యాణ మండపం వరకు నిర్వహించారు. అనంతరం హనుమంతుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, హిందువాహిని తదితర ధార్మిక సంస్థల నేతలు, కార్యకర్తలు కాషాయ ధ్వజాలను చేతబూని ఊరేగింపులో పాల్గొన్నారు. అడుగుల భజన, చెక్క భజనలు, ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నర్సింహ, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, ఎస్పీ వెంకటేశ్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, బుచ్చారెడ్డి పాల్గొన్నారు.

➧ జడ్చర్ల పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. నాగసాల శివారులో ఆంజనేయస్వామి ఆలయం నుంచి హనుమాన్ విజయ సంకల్ప శోభాయాత్ర ప్రారంభమైంది. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పురవీధుల గుండా భారీ కొనసాగింది. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నంద, రాజు, హిందూవాహని జిల్లా అధ్యక్షుడు రాజుగౌడ్, నాగరత్నం, మణిరత్నం, సంతోష్ పాల్గొన్నారు.

➧ అడ్డాకుల, మూసాపేట మండలాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నవాబుపేట మండల కేంద్రంతో పాటు కొల్లూర్, యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, మరికల్, పోమాల్, లోకిరేవు, బంగ్రంపల్లి, రుద్రారం, చాకలపల్లి, నీర్‌సాబ్‌తండా తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. కోయిల్‌కొండ మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. మహమ్మదాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ఉత్సవాలను నిర్వహించారు. గూంగ్యతండాలో సామూహిక హోమం నిర్వహించి బైక్ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో గురువారం హనుమాన్ జయంతిని నిర్వహించారు. యువకులు హనుమాన్ జెండాలను పట్టుకుని శోభాయాత్ర నిర్వహించారు.

➧ రాజాపూర్ మండల కేంద్రంతో పాటు తిర్మలాపూర్, రాయపల్లి, రంగారెడ్డిగూడ, చొక్కంపేట్ తదితర గ్రామాల్లో పురవీధుల్లో ఊరేగించారు. మిడ్జిల్ మండల కేంద్రంతో పాటు బోయిన్‌పల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర చేపట్టారు. బాలానగర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని మోతీఘనపూర్, పెద్దరేవల్లి, ఉడిత్యాల గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. హన్వాడ మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ఉత్సవాలను నిర్వహించారు.



ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



డోలు వాయిస్తున్న కళాకారులు



నవాబుపేటలో..



కోయిలకొండ మండలం గార్లపహాడ్‌లో..



బోనాలతో కోలాటం వేస్తున్న మహిళలు



రాజాపూర్‌లో..



మిడ్జిల్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి



జడ్చర్ల: రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి గోపినాథ్ తెలిపారు. గురువారం మండలంలోని గంగాపూర్ రైతువేదికలో విత్తన, పురుగు మందులు, ఎరువుల డీలర్లతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, నెల రోజులు ముందుగానే తమ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని అన్నారు. విక్రయించే వాటికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, వాటిపై అందుకు సంబంధించిన లాట్, బ్యాచ్ నంబర్లతో పాటు గడువు తేదీని తప్పనిసరిగా పేర్కొనాలన్నారు. దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, స్టాక్ రిజిస్టర్‌లో కొనుగోలు చేసిన ఇన్వాయిస్ నంబర్లతో పాటు అమ్మిన బిల్‌నంబర్లను రాయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయించరాదని, కాలం చెల్లిన మందులు, విత్తనాలు, పురుగు మందులు, గ్లైపోసేట్ కలుపు మందులను దుకాణంలో ఉంచవద్దన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం డిప్యూటీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ప్రయాణీకుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుజాత, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు హనుమంత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సర్వశిక్షా అభియాన్ ఏఎంఓ వెంకట్రాంరెడ్డి, సీఎంఓ బాలుయాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజ్ గౌడ్, బాలచంద్రుడు, జోషి పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి ప్రాధాన్యం



డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: తండాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతిఒక్కరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 3వ వార్డులోని గుబ్బడి తండాలో 33 డబుల్ ఇళ్ల నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ చొరవతో హైదరాబాద్‌లో బంజారా భవన్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, గుబ్బడితండాలో అధికంగా గుడిసెలు, పెంకుటిల్లలో నివాసం ఉంటున్నారని, అర్హులైనందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ముడా డైరక్టర్లు చంద్రశేఖర్‌గౌడ్, సాయిలు, నాయకులు నారాయణ గౌడ్, రాము నాయక్, సత్యనారాయణ, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరకద్ర: యువత ఉన్నత స్థానాలకు ఎదగడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ షాపును ఆయన ప్రారంభించారు.

వైభవంగా పాండురంగస్వామి కల్యాణం



ధర్మాపూర్‌లో కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ధర్మాపూర్‌లో రుక్మిణి పాండురంగస్వామి కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధర్మాపూర్ గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తుల మధ్య అమ్మవారి ఉత్సవం కనుల పండువగా చేపట్టారు. కల్యాణోత్సవం సందర్భంగా మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, శోభాయమానంగా అలంకరించిన కల్యాణ కట్ట మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాల మధ్య జరిగిన ఈ పవిత్ర ఘట్టాన్ని చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు.

మంత్రి ప్రత్యేక పూజలు..

రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణ మహోత్సవానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి మంత్రి కల్యాణాన్ని తిలకించారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం..

జడ్చర్ల: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలతో పాటు పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, అర్చనలతో పాటు శ్రీనివాస కల్యాణ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త నరహరి భీంసేనాచార్యులు, నరహరి సురేంద్రచారీ, రేవతి, వెంకట్‌రెడ్డి, రాఘవేంద్రచార్యులు పాల్గొన్నారు.

పీఆర్ డీఈపై సర్పంచ్‌ల ఆగ్రహం



పీఆర్ డీఈ శివరామకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

అడ్డాకుల: పంచాయతీరాజ్ డీఈ శివరామకృష్ణపై కమీషన్ల బాగోతంపై సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పనులు చేసిన తర్వాత బిల్లులు చేయడానికి మూడు శాతం కమీషన్ ముందే ఇవ్వాలా అంటూ సభలో నిలదీశారు. తీసుకున్న కమీషన్ డబ్బులను టేబుల్‌పై పెట్టి వెళ్లాలని, లేదంటే ఇక్కడి నుంచి వెళ్లనివ్వమని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డాకుల మండల సర్వసభ్య సమావేశం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, తహసీల్దార్ కిషన్ హాజరయ్యారు. అప్పులు చేసి రోడ్లు వేస్తే బిల్లులు చేయడానికి మూడు శాతం కమీషన్ ముందే ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డీఈ తీరుపై ఎంపీపీ, జెడ్పీటీసీ, విండో అధ్యక్షుడు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు చేయడానికి ఇబ్బందులు పెడితే ఇంతకంటే ఎక్కువే ఎదుర్కొవాల్సి వస్తుందని సర్పంచ్‌లు హెచ్చరించారు.

ఉపాధి బిల్లులు ఎప్పుడొస్తాయి..

గ్రామాల్లో ఉపాధిహామీ కింద పనులు చేస్తే ఇంత వరకు బిల్లులు రావడం లేదని సర్పంచ్‌లు జయన్న, శ్రీకాంత్, కిషన్‌నాయక్, సుమతమ్మ వాపోయారు. పనులు చేయాలని వెంట పడే ఉపాధి అధికారులు తర్వాత బిల్లులు ఇప్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారని సిబ్బందిని నిలదీశారు. ఇసుక కొరతను తీర్చాలని తహసీల్దార్ కిషన్‌కు సర్పంచ్‌లు విజ్ఞప్తి చేశారు. తిమ్మాయిపల్లి తండాలో వ్యవసాయానికి కరెంటు స్తంభాలు మంజూరైనా అందుకు సంబంధించిన మెటీరియల్ ఇవ్వడం లేదని సర్పంచ్ కిషన్‌నాయక్ వాపోయారు. సమావేశంలో ఏఓ శ్రీనివాసులు, ఎంఈఓ నాగయ్య, డాక్టర్లు రాజేష్ ఖన్న, అపర్ణ, లావణ్య, షబానాబేగం, ఏపీఎం సుధీర్, ఏపీఓ అతహార్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలి




పోతన్‌పల్లిలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమం గురువారం మండలంలోని పోతన్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ఎన్నికలకు వస్తున్నాయని, ఓడించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఉచితంగా ఇళ్లు, దళిత, గిరిజన నిరుపేదలకు వ్యవసాయ భూములను పంపిణీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఉబేదుల్లా కొత్వాల్, బెక్కరి అనిత, టీపీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కోటకదిర ఎంపీటీసీ సభ్యురాలు మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

కోయిల్‌కొండ: ప్రజల్లో వస్తున్న ఆదరణను చూస్తుంటే త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆచార్యపూర్‌లో వైభవంగా నిర్వహిస్తున్న వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు కలిసి పనిచేయాలన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో ప్రభుత్వంపై వ్యతిరేకత నెలకొందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వై.మహేందర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, జి.రవీందర్, విద్యాసాగర్, బండియాదవ్ కుమార్, రామునాయక్, జగన్, రవినాయక్, చందపూర్‌కృష్ణ, వెంకటేష్, జమాల్‌పూర్ కృష్ణయ్య, మనోజ్ ,రామస్వామి, నాగరాజు, శేఖర్, శివ, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా



మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని అన్ని కాలనీలు, శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన వీరన్నపేట- కేటీఆర్ నగర్‌లో పర్యటించి మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే బైపాస్ నిర్మాణంతో ఈ కాలనీకి డిమాండ్ వస్తుందన్నారు. తక్కువ సమయంలో దివిటిపల్లిలోని ఐటీ కం ఎనర్జీ పార్కుకు వెళ్లి ఉద్యోగాలు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం పండుగ సాయన్న ముని మనుమడ్లు నర్సింహులు, యాదయ్యలకు కేటాయించిన ఇళ్లను పరిశీలించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శ్రీనివాస్‌కాలనీలోని మంగలిగుట్టకు వెళ్లి రోడ్డు సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే పెద్దచెరువు మినీ ట్యాంకుబండ్ వద్ద కొనసాగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ మనోహర్, కౌన్సిలర్లు కిశోర్‌కుమార్, అనంతరెడ్డి, సంధ్యా శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజు పాల్గొన్నారు.

జెడ్పీ సెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామ రక్ష అని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని పోతన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంక్షేమానికి బీజేపీ కృషి



జిల్లా కేంద్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి



జడ్చర్లలో ఎగురవేసిన బీజేపీ నాయకులు



గండేడ్‌లో..

పాలమూరు: దేశ రక్షణతో పాటు ప్రజల సంక్షేమం కోసం బీజేపీ ప్రతినిత్యం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాకుల బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్పీ వెంకటేష్, సత్యం, కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, నారాయణ యాదవ్, మహిళ మోర్చా అధ్యక్షురాలు పద్మవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాజుగౌడ్ గ్రామ కూడలిలో పార్టీ జెండాను ఎగురవేశారు.

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు, లోకిరేవులో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు యాదయ్య, శ్రీను, బాలస్వామి, నర్సింహ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండా బుచ్చిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, శివలింగం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజాపూర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ఆదిత్య, శ్రీను, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్, నరేష్, రామకృష్ణ, లింగం, యాదయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల: పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్ రాజు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనాథ్, నరేష్, నవీన్ పాల్గొన్నారు.

గండేడ్: మండల కేంద్రంలో బీజేపీ జెండాను మండల అధ్యక్షుడు ప్రభునాయక్ ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, మహిపాల్‌గౌడ్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.